సాక్షి
జగిత్యాల

మంగళవారం : 17 : అక్టోబర్ : 2023

బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారు



ధర్మపురి: శరన్నవరాత్రి ఉవాల్లో భాగంగా అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో రెండోరోజు అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జగిత్యాల: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని ల్యాండ్ అక్వేషన్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 30 మంది అర్జీలు పెట్టుకున్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని శ్రీనివాస్‌రావు అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అర్జీలు తీసుకుంటారో..? లేదో..? అని ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. అయితే ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉన్నా.. కోడ్‌కు, ప్రజావాణి కార్యక్రమానికి సంబంధం లేదని అధికారులు పేర్కొన్నారు.

ప్యాక్స్ మాజీ సీఈవో ఇల్లు వేలం

- రూ.2.15 కోట్లు దుర్వినియోగ ఫలితం
- రికవరీకి ఉత్తర్వులు



మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ సహకార సంఘంలో నిధుల అవకతవకలపై చర్యలు చేపట్టిన అధికారులు.. రికవరీకి సంఘం మాజీ సీఈవో కొత్తకొండ పరమేశ్వర్ ఇంటితోపాటు, ఖాళీ స్థలాన్ని సోమవారం వేలం వేశారు. మాజీ సీఈవో పరమేశ్వర్ ఇంటిఎదుట ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, వైస్‌చైర్మన్ దులూరి సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, సభ్యులు గ్రామస్తుల సమక్షంలో కేడీసీసీబీ అసిస్టెంట్ రిజిస్టర్, సెల్ అధికారి వంశీకృష్ణ సమావేశమై వేలం వేశారు. పరమేశ్వర్ సీఈవోగా పనిచేసిన సమయంలో సంఘం నిధులు రూ.2,15,20,724 దుర్వినియోగం చేశాడని, పాలకవర్గం, సభ్యుల ఫిర్యాదు మేరకు రూ.2.15కోట్ల రికవరీకి సర్‌చార్జ్ ఉత్తర్వులు విడుదలయ్యాయని, ఈసీ ఫైల్ చేసి కండిషనల్ అటాచ్‌మెంట్ అయిన అతని ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. వేలంలో గ్రామం నుంచి 9మంది పాల్గొని ఇంటిని రూ.7,01,000కు, ఖాళీ స్థలాన్ని రూ.4,02,000కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ బీ.ప్రవీణ్‌కుమార్, డీఈ శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ అంజిరెడ్డి, సీఈవో రాజేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నంది వాహనంపై రామలింగేశ్వరుడు



నంది వాహనంపై శ్రీరామలింగేశ్వరుడు

ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నంది వాహనంపై శ్రీరామలింగేశ్వర స్వాములకు శోభయాత్ర నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌గా సదాశివరామకృష్ణ

మెట్‌పల్లి: మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌గా సదాశివ రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న శ్రీనివాస్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న సదాశివరామకృష్ణను ఉన్నతాధికారులు నియమించారు.

వాటర్ ప్లాంట్లకు జరిమానా

జగిత్యాలరూరల్: జిల్లాలోని వాటర్‌ప్లాంట్ నిర్వాహకులకు భూగర్భజల శాఖ నోటీసులు జారీ చేస్తోంది. బోరు మోటారు వినియోగించుకుంటూ వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్న వారికి భూగర్భజల శాఖ అధికారులు జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేస్తున్నారు. నాలుగు రోజులుగా జిల్లాలోని జాబితాపూర్, లక్ష్మీపూర్, ధర్మారం, పలు గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న వారికి జరిమానా చెల్లించాలని నోటీసులు అందించారు. ఇది జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. జిల్లా భూగర్భ జలశాఖ అధికారి పీహెచ్.శైలశ్రీ మల్లికదేవి ఒక్కో నిర్వాహకుడు రూ.19,500 చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. దీంతో వాటర్ నిర్వాహకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మహిళలే కీలకం..!

- యువత ఓటర్లపై గురి
- అన్ని పార్టీలదీ అదేదారి
- ప్రసన్నం చేసుకునేందుకు తంటాలు



జగిత్యాల: జిల్లాలో మహిళలు, యువతే అధికంగా ఉంది. ఎన్నికల బరిలో నిలిచే నేతల తలరాతలను వీరే నిర్ణయిస్తారు. జిల్లాలో పురుషులతో పోల్చితే మహిళలు 23,336 మంది ఎక్కువగా ఉన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ఓటు వేయాలని, ముఖ్యంగా యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు. స్పెషల్ డ్రైవ్ కూడా చేపట్టారు. ఫలితంగా జిల్లాలో యువత ముందుకొచ్చింది. ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఫలితంగా 20 నుంచి 29ఏళ్ల వరకు 1,40,622 మందికి చేరింది. అలాగే 18 నుంచి 19 ఏళ్లవారు 21,025 మంది ఓటు కలిగినవారు ఉన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో వీరి ఓటు కూడా ప్రధాన పార్టీల అభ్యర్థులకు కీలకంగా మారనుంది. ఎన్నికల బరిలో ఉన్న నేతల తలరాతలు వీరితో మారే అవకాశముంది. ఈ నేపథ్యంలో బరిలో ఉన్న నాయకులు ఎక్కువ శాతం మహిళలు, యువతను లక్ష్యంగా చేసుకుని ముందుకొస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లోనూ అంతే..

జిల్లాలో మూడు జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలుగా ఉన్నాయి. ఈ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ పడుతున్న నాయకుల భవిష్యత్ ముఖ్యంగా యువత, మహిళలపైనే ఆధారపడి ఉంది. ఈ మూడు నియోజకవర్గాల్లో పురుషులకన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు. తర్వాతి స్థానంలో యువత ఉన్నారు. వీరు ఎవరివైపు మొగ్గుచూపితే వారికే విజయావకాశాలు ఉన్నాయి. ఎక్కువగా ఇంటింటికీ ప్రచారంలో భాగంగా మహిళలకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వం నుంచి పొందుతున్న పథకాలను చూపుతూ ఓటర్లను రాబట్టుకునే ప్రయత్నంలో నేతలున్నారు. అలాగే అధికారులు కొత్త ఓటర్లను నమోదు చేయడంలో విస్తృతంగా ప్రచారం చేయడంతో గ్రామాల్లో, పట్టణాల్లో ఓటరు నమోదు చేసుకోవడంతో ఈసారి యువత ఎక్కువగా నమోదైంది. యువత పూర్తిస్థాయిలో ఓటు హక్కు వినియోగించుకుంటే గెలుపు, ఓటముల ప్రభావం వారి చేతుల్లోనే ఉంటాయి. ఇప్పటి నుంచే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు యువత, మహిళలనే టార్గెట్ చేస్తూ ప్రచారం చేస్తున్నారు. యువతను సైతం ఈసారి ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఓటు హక్కు ఎంతో ప్రాముఖ్యమైందో వారికి వివరించారు. మహిళలకు, యువతకు సంబంధించి ప్రత్యేక బూత్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పిస్తున్నారు. ఈసారి మహిళలు, యువత ఓట్ల పోలింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలిసారి ఓటు హక్కు నమోదు చేసుకున్న యువతకు ఇది మంచి అవకాశం. వీరి ఓటరు శాతం పెరిగే అవకాశాలుండటంతో నేతల తలరాతలు వీరి చేతుల్లోనే ఉంటాయి.

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	మొత్తం
కోరుట్ల	1,23,692	1,13,030	2,36,726
జగిత్యాల	1,17,115	1,09,300	2,26,635
ధర్మపురి(ఎస్సీ)	1,14,622	1,09,963	2,24,591
మొత్తం	3,55,620	3,32,293	6,87,952

వయసు	మహిళలు
18-19	9135
20-29	69627
30-39	80812
40-49	72103
50-59	59288
60-69	37054
70-79	19929
80-89	6339
90-99	1240
100-109	93
110-119	1

ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



జగిత్యాల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో మహిళలు, దివ్యాంగులు, మోడల్ యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందులో కోరుట్లలోని ఇబ్రహీంపట్నం పోలింగ్ కేంద్రం 25ను మహిళలకు, నంబరు 47ను మోడల్ పోలింగ్ కేంద్రంగా, మల్లాపూర్‌లోని పోలింగ్ కేంద్రం నంబరు 56ను మహిళలకు, 67 కేంద్రాన్ని మోడల్‌గా, కోరుట్లలోని పోలింగ్ కేంద్రం నంబరు 147 మహిళలకు, 97, 164 కేంద్రాలను మోడల్‌గా, 134 కేంద్రాన్ని యువతకు కేటాయించామని, మెట్‌పల్లిలోని 38, 200 కేంద్రాలను మహిళలకు, 236ను దివ్యాంగులకు, 206 కేంద్రాన్ని మోడల్‌గా గుర్తించామన్నారు. జగిత్యాలలోని రాయికల్ పోలింగ్ కేంద్రం 39 మహిళలకు, 27 కేంద్రాన్ని మోడల్‌గా, బీర్‌పూర్‌లో 83 కేంద్రాన్ని మహిళలకు, 67 కేంద్రాన్ని మోడల్‌గా, సారంగాపూర్ పోలింగ్ కేంద్రం 101 మహిళలకు, 104 మోడల్, 90 కేంద్రాన్ని యువతకు కేటాయించామన్నారు. జగిత్యాలరూరల్‌లోని 116 పోలింగ్ కేంద్రాన్ని మహిళలకు, 254మోడల్‌గా, జగిత్యాలలో 148 కేంద్రం మహిళలకు, 247 కేంద్రం దివ్యాంగులకు, 255 మోడల్‌గా గుర్తించామన్నారు. ధర్మపురిలోని బుగ్గారంలో 31కేంద్రం మహిళలకు, 32 కేంద్రం దివ్యాంగులకు, ధర్మపురిలోని 144మోడల్‌గా, 162 కేంద్రం యువత, ఎండపల్లిలోని 97 కేంద్రం మహిళలకు, గొల్లపల్లిలో 181 కేంద్రం మహిళలకు, 210 కేంద్రం మోడల్‌గా, పెగడపల్లిలో 245కేంద్రం మహిళలకు, 253మోడల్‌గా, వెల్గటూర్‌లో 76 కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ఏర్పాటు చేశామని తెలిపారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో విపక్షాల్లో ఆందోళన



పెగడపల్లి: బీఆర్‌ఎస్ మేనిఫెస్టో చూసిన విపక్షాల్లో అయోమయం నెలకొందని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మండలకేంద్రంలో మాట్లాడారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. కొప్పుల ఈశ్వర్‌ను మరోసారి గెలిపించుకోవాలన్నారు. మంత్రి ఈశ్వర్‌ను గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, ఏఎంసీ చైర్మన్ నిర్మల, రమణారావు, గంగాధర్, నరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడి ఉన్నారు.

బీఫాం అందుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులు

- సీఎం కేసీఆర్ నుంచి అందుకున్న మంత్రి కొప్పుల ఈశ్వర్
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కోరుట్ల నుంచి సంజయ్ కూడా..



కేసీఆర్ నుంచి బీ ఫాం అందుకుంటున్న మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కోరుట్ల అభ్యర్థి సంజయ్

జగిత్యాల/కోరుట్ల/ధర్మపురి: జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థులుగా సంజయ్‌కుమార్, కల్వకుంట్ల సంజయ్, మంత్రి కొప్పుల ఈశ్వర్ సీఎం కేసీఆర్ చేతులమీదుగా సోమవారం బీఫాం అందుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ వారికి ఫారాలు అందించి అభినందించారు. కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ యశోద ఆసుపత్రిలో స్పైన్ సర్జన్‌గా పనిచేస్తూనే.. తన తండ్రి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బాటలో నడిచారు. ఈసారి విద్యాసాగర్‌రావు వయోభారంతో సంజయ్‌కు టికెట్ ఇవ్వాలని కేసీఆర్‌కు విన్నవించడంతో అంగీకరించారు.

షాషా సెంటిమెంట్

విద్యాసాగర్‌రావు బీ-ఫాం తీసుకునే ప్రతిసారి ఆయన మనమరాలు, సంజయ్ కూతురు షాషాను వెంట తీసుకెళ్లడం సెంటిమెంట్. అదే ఆనవాయితీ కొనసాగిస్తూ సంజయ్ కూడా తన కూతురు షాషాతో కలిసి బీ-ఫాం అందుకున్నారు.

ప్రజల ఆశీస్సులతో మళ్లీ గెలుస్తా..

ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే తనను మరోసారి గెలిపిస్తుందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. టీఆర్‌ఎస్ నుంచి నాలుగుసార్లు బరిలో నిలిచి గెలుపొందానని, తనపై ఉన్న విశ్వాసంతోనే సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ నుంచి బీఫాం అందించారని తెలిపారు.

గులాబీ ప్రచారభేరి!



సిరిసిల్లలో నిర్వహించే సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి కల్వకుంట్ల తారకరామారావు

- నేడు సిరిసిల్లలో ప్రజా ఆశీర్వాద సభ
- ఉమ్మడి జిల్లాలో రెండో శంఖారావం
- భారీ జనసమీకరణలో బీఆర్‌ఎస్ శ్రేణులు
- బైపాస్ రోడ్డులో వేదిక ఏర్పాటు

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సిరిసిల్ల: బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. పార్టీకి, ఉద్యమానికి ఊపిరిలూదిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వరుససభలు నిర్వహిస్తూ తన కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నంచేస్తోంది. ఆదివారం హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం అయ్యింది. ఈక్రమంలో మంగళవారం సిరిసిల్లలో భారీ బహిరంగ సభ తలపెట్టింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ నిర్వహించే రెండో భారీ ప్రచారసభ ఇదే కావడం గమనార్హం. సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కె.తారకరామారావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కేంద్రంగా ఎన్నికల ప్రచార సభలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభ కోసం పదెకరాల స్థలాన్ని సిద్ధంచేశారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి నేరుగా సిరిసిల్లకు హెలీకాప్టర్‌లో చేరుకుని ప్రసంగిస్తారు. అనంతరం సిద్దిపేటలో జరిగే సభకు వెళ్లనున్నారు. సీఎం కేసీఆర్ తనయుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో తొలిసభ నిర్వహించడం విశేషం. 2009 నుంచి ఇప్పటి వరకు ప్రతీ ఎన్నికల్లో తనయుడి విజయం కోసం తండ్రి కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

భారీజనసమీకరణకు ఏర్పాట్లు..

సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజాఆశీర్వద బహిరంగ సభ కోసం భారీగా జనాన్ని సమీకరించాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఇప్పటికే మంత్రి కేటీఆర్ పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశనం చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనే ఎక్కువ మందిని సమీకరించాలని భావిస్తున్నారు. తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల నుంచి ఎక్కువ మందిని సమీకరించి సభను సక్సెస్ చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. 2018 నాటి ఎన్నికల ప్రచార సభను నిర్వహించిన స్థలంలోనే సభను ఏర్పాటు చేశారు. రెండుచోట్ల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. వంద మంది వీవీపీ కూర్చునేందుకు వీలుగా స్టేజీ ఏర్పాటు చేశారు.

గులాబీమయమైన సిరిసిల్ల..

సీఎం కేసీఆర్ పాల్గొనే సభ కోసం సిరిసిల్ల పట్టణాన్ని గులాబీ జెండాలతో అలంకరించారు. సిరిసిల్ల-కామారెడ్డి, సిరిసిల్ల-సిద్దిపేట, సిరిసిల్ల-వేములవాడ మార్గాల్లో రోడ్డుకు ఇరువైపులా కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల నిండాగులాబీ జెండాలతో నిండిపోయింది.

హామీల జల్లు కురిసేనా..?

సీఎం కేసీఆర్ సిరిసిల్ల సభకు వస్తున్న సందర్భంగా ఈప్రాంత ప్రధాన సమస్యలపై సీఎం కేసీఆర్ హామీల జల్లు కురుస్తుందని ఆశిస్తున్నారు. మధ్యమానేరు జలాశయం పూర్తయినా.. గోదావరి జలాలు ఇంకా నర్మాల ఎగువ మానేరు, నిమ్మపల్లి మూలవాగు జలాశయాలకు చేరలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా మల్కపేట వరకు గోదావరి జలాలు చేరినా.. ఇంకా కొనసాగింపు పెండింగ్‌లోనే ఉంది. నేత కార్మికులను ఓనర్లను చేసే ‘వర్కర్ టూ ఓనర్’ పథకం ఇంకా అందుబాటులోకి రాలేదు. షెడ్లు నిర్మాణంలో ఉండగా.. లూమ్స్ ఇంకా ఏర్పాటుకాలేదు. వేములవాడలో రోడ్డు విస్తరణ, ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వేములవాడలో మూలవాగుపై రెండో వంతెన నిర్మాణంలో ఉంది. పెద్దూరు వద్ద అపెరల్ పార్క్‌లో అభివృద్ధి, నేతన్నల కోసం యారన్ డిపో ఏర్పాటు, ఇల్లులేని వారికి గృహలక్ష్మి పథకం మంజూరు వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపిస్తారని ఆశిస్తున్నారు.

అధికారంలోకి రాగానే షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం

- బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో గల్ఫ్ బోర్డు ఊసేలేదు
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

జగిత్యాల: బీజేపీ అధికారంలోకి రాగానే ముత్యంపేటలోగల షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మహారాష్ట్ర మాజీమంత్రి రాంషిండేతో కలిసి పట్టణంలోని సుమంగళి గార్డెన్స్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత తెలంగాణ సొమ్మును కొల్లగొట్టిందని, ఆమె జైలుకు వెళ్లడం తప్పదని జోస్యం చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు దళారి వ్యవస్థను కాంగ్రెస్ పార్టీ పెంచిందని, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల స్కాంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ మెనిఫెస్టోలో గల్ఫ్ బోర్డు ఊసేలేదన్నారు. పంట నష్టానికి రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ భవిష్యత్ కోసం నరేంద్రమోదీ సర్కారు రావాలన్నారు. రాంషిండే మాట్లాడుతూ బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి మాట్లాడుతూ ధర్మయుద్ధంలో విజయకేతనం ఎగురవేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, జగిత్యాల కన్వీనర్ మనోహర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పడాల తిరుపతి, రాగిళ్ల సత్యనారాయణ, దశరథరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్ష



మాట్లాడుతున్న, అదనపు కలెక్టర్

జగిత్యాల: వానాకాలానికి సంబంధించిన ధాన్యం కొనుగోళ్లపై సోమవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. మరో 15 రోజుల్లో కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి కేంద్రంలో మొబైల్ అప్లికేషన్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. దీనిపై ఏవో, ఏఈవోలకు సూచనలు ఇవ్వాలన్నారు. కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు, టార్పాలిన్లు, వసతులు కల్పించడంపై సహకార సంఘాల సీఈవోలు, పెర్స్ ఏపీఎంలకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి, డీఆర్‌డీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పొలాసలో రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడలు

- నేటి నుంచి మూడురోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ పాలిటెక్నిక్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పొలాస వ్యవసాయ పాలిటెక్నిక్ వేదిక కాబోతోంది. 1996లో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో తొలిసారి రాష్ట్రస్థాయి పోటీలు జరగనుండడం విశేషం. మంగళ, బుధ, గురువారాల్లో (మూడురోజుల పాటు) నిర్వహించనున్నారు. పోటీలను ప్రారంభించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు రానున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను కళాశాల ప్రొఫెసర్లు చేస్తున్నారు.

250 మంది విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక కళాశాల జట్టుతోపాటు కంపసాగర్, పాలెం, మాల్ తుమ్మెద, జోగిపేట, తోర్నాల, రుద్రూరు, మధిర, కంది, జమ్మికుంట, జసంత్‌పూర్, నారాయణపేట కళాశాలల జట్లు పాల్గొంటున్నాయి. ప్రతి కళాశాల నుంచి 20మంది చొప్పున మొత్తం 250 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరంతా సోమవారం సాయంత్రం వరకే పాలిటెక్నిక్‌కు చేరుకున్నారు. వాలీబాల్, టేబుల్‌టెన్నిస్, క్యారమ్స్, త్రోబాల్, టెన్నికాయిట్, రన్నింగ్, జావెలిన్‌త్రోలో పోటీ పడతారు. అలాగే వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్‌పోటీలు ఉంటాయి. సాయంత్రం వేళల్లో కళాశాల ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, పాటలు, నృత్య పోటీలు ఉంటాయి. అన్ని అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కళాశాలల పీఈటీ, పీడీలు ఇప్పటికే పొలాస కళాశాలకు చేరుకున్నారు.

హాజరుకానున్న వర్సిటీ అధికారులు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను కలెక్టర్ యాస్మిన్‌బాషా మంగళవారం ఉదయం లాంఛనంగా ప్రారంభిస్తారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.వెంకటరమణ, అగ్రికల్చర్ డీన్ సీమా, స్టూడెంట్ అఫైర్స్ డీన్ జిల్లా సత్యనారాయణ, పాలిటెక్నిక్ డైరెక్టర్ పద్మజ, యూనివర్సిటీ క్రీడాపోటీల పరిశీలకులు సురేష్, పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతి నారాయణ్‌భట్ పాల్గొంటారు. రాష్ట్ర స్థాయి ముగింపు కార్యక్రమానికి ఎస్పీ లేదా అదనపు ఎస్పీ రానున్నారు.



క్రీడాపోటీలు నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న వర్సిటీ అధికారులు

ఏర్పాట్లు చేశా



రాష్ట్రస్థాయి క్రీడలను పొలాస కళాశాలలో నిర్వహించడం గర్వకారణం. ఈ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు సోమవారం సాయంత్రం వరకు పొలాసకు చేరుకున్నారు. అన్ని వసతులూ కల్పిస్తున్నాం. – డాక్టర్ శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

క్లుప్తంగా

చీరల పట్టివేత


పట్టుబడిన చీరలతో ఎస్సై అజయ్

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం బోర్నపల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా చీరలు పట్టుబడ్డాయి. గంగాధర మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఓమిని వ్యాన్‌లో 305 చీరలు, 118 టవల్స్‌ను నిర్మల్ జిల్లా కడెంకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఓమిని వాహనంతోపాటు, స్వాధీనం చేసుకున్న చీరలు, టవల్స్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుల్ శంకర్, హోంగార్డు రాంచంద్రం పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు శాలిని


శాలిని

కథలాపూర్(వేములవాడ): మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని తోకల శాలిని ఎస్జీఎఫ్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ మండల కన్వీనర్ రవీందర్ సోమవారం తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు వనపర్తి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో శాలిని ప్రతిభచాటింది. ఈసందర్భంగా శాలిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల హెచ్‌ఎం కిషన్‌రావు, పీఈటీ వాసాల రాజు హర్షం వ్యక్తం చేశారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన యువకులు


ప్రతిభచాటిన యువకులు

కోరుట్లరూరల్: జూనియర్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని అయిలాపూర్‌కు చెందిన యువకులు ప్రతిభ చాటారు. బెంగుళూర్‌లో ఈ నెల 12 నుంచి 15 వరకు నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఠాకూర్ పృథ్వీరాజ్ 67.5 కేజీల కేటగిరీ బెంచ్ ప్రెస్‌లో వెండి పతకం, సాయి చైతన్య 75 కేజీల కేటగిరీ బెంచ్ ప్రెస్‌లో వెండి పతకం సాధించారు. వీరిని కోరుట్ల వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎంఏ భారి, తదితరులు అభినందించారు.

సౌత్ ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


పతకం సాధించిన రాజు (మధ్యలోని వ్యక్తి)

జగిత్యాల: జిల్లాలోని మేడిపల్లి గురుకుల పూర్వ విద్యార్థి సీహెచ్.రాజు ఇటీవల సౌత్ జోన్ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈసందర్భంగా పతకం సాధించడం జిల్లాకే గర్వకారణమని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ముత్తయ్యరెడ్డి అభినందించారు.

సీజన్.. బైండోవర్!

- జిల్లాలో 450 మంది బైండోవర్
- బెల్ట్‌షాప్‌లు.. రౌడీషీట్లు.. ఎన్నికల కేసులు.. ప్రలోభాలు
- ఎన్నికల ముందు జాగ్రత్త

కోరుట్ల: రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా సాగాలన్న లక్ష్యంతో పోలీసు యంత్రాంగం ముందు జాగ్రత్తలు చేపట్టింది. వారం రోజుల నుంచి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో సర్వే నిర్వహించిన ఎన్నికల విధుల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది, పోలీసు యంత్రాంగం పూర్తి వివరాలు సేకరించింది. ఈ మేరకు రోజూ బైండోవర్‌లు కొనసాగుతున్నాయి. గత ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురిచేయడం, మద్యం సరఫరా వంటి కేసుల్లో ఉండి పోలీసుల రికార్డుల్లో ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గ్రామాల్లో కొత్తగా సమస్యలు సృష్టించే అవకాశమున్న వారితో పాటు, రౌడీషీటర్లు, బెల్ట్‌షాపుల నిర్వాహకులను బైండోవర్ చేస్తున్నారు.

జిల్లాలో 1,550 మంది పైనే..

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్లలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలతో పాటు 380 గ్రామ పంచాయతీల్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఇదివరకు సమస్యలకు కారణమైన వారితో పాటు మళ్లీ గొడవలు, ఇతరత్రా వివాదాలు సృష్టించేందుకు కారకులయ్యే వారిని పోలీసులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,550 మంది వరకు ఉన్నట్లుగా సమాచారం. వీరందరిని బైండోవర్ చేసి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు పోలీసులు పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లోనూ పోలీసులు బైండోవర్ పనిలో పడ్డారు.

చకచకా..

ఎన్నికల సమయంలో మద్యం, డబ్బు, చీరలు, ఇతరత్రా వస్తువులు అందించి ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్న క్రమంలో పోలీసులు బైండోవర్ చేసే పని చకచక పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సుమారు 450 మంది వరకు బైండోవర్ అయినట్లు సమాచారం. మిగిలిన వారిని త్వరితగతిన బైండోవర్ చేసేందుకు పోలీసులు సన్నాహాలు చేపట్టారు. మరో వారం రోజుల వ్యవధిలో గత ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో గొడవలు, వివాదాలకు కారణమైన వారందరిని అరెస్టు చేయనున్నట్లు సమాచారం.

> **ముందు జాగ్రత్త చర్య**
>
> ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించడంలో భాగంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. బెల్ట్‌షాపుల నిర్వాహకులు, రౌడీ షీటర్లు, గత ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన వారిని, గొడవలు, వివాదాలు సృష్టించే అవకాశం ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నాం.
>
> – రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

మంత్రి కొప్పుల చేసిన అభివృద్ధి శూన్యం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


బైక్‌పై ర్యాలీగా వస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు

వెల్గటూర్(ధర్మపురి): ధర్మపురి నియోజకవర్గానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధి శూన్యమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్ఠానం టికెట్ కేటాయించిన సందర్భంగా రాజారాంపల్లి వివేకానంద కూడలి వద్ద లక్ష్మణ్‌కుమార్‌కు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. రాజారాంపల్లి నుంచి వెల్గటూర్ అంబేద్కర్ కూడలి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ, మంత్రి కొప్పుల ఈశ్వర్ 20 ఏళ్లుగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ నియోజకవర్గంలో పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీలు, వంద పడకల హాస్పిటల్ ఏమీ తీసుకురాలేదని, కాళేశ్వరం లింక్–2 కింద ఈ ప్రాంత రైతుల 2 వేల ఎకరాల భూములు మెఘా కంపెనీకి కట్టబెట్టి అరకొర పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వెల్గటూర్ మండలంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తానని, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, ఒక్కసారి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, ఎంపీటీసీ తిరుపతి, నాయకులు శ్రీకాంత్‌రావు, సందీప్, కుమారస్వామి, ఉదయ్, గెల్లు శ్రీనివాస్, మల్లేశం, వెంకటేశ్, శ్రీనివాస్, సాగర్, తిరుపతి, హరీశ్, సంజీవ్, మహేశ్, బైరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

ధర్మపురి: గ్యారెంటీ పథకాలతో ప్రజల ముందుకొస్తున్న కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు, ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని దొంతాపూర్, మగ్గిడి, ఎడపెల్లి గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారాన్ని కొనసాగించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే అధిష్ఠానం ఇచ్చిన గ్యారెంటీలను తప్పక తీరుస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి ఏమీ లేదని, దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు చేసిన అభివృద్ధి పనులే నేటికి అగుపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేశ్, సింహరాజు ప్రసాద్, కుంట సుధాకర్, రాజేందర్, శేఖర్ తదితరులున్నారు.

టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఏది?

- వైఎస్సార్ హయాంలో మేనిఫెస్టోలోలేని పథకాల అమలు
- విజయరమణారావుకు ప్రగతిభవన్ నుంచి నిధులు
- హైదరాబాద్ 2024జూన్ దాకా ఉమ్మడి రాజధానియే
- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు


మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రతీ పార్లమెంట్ పరిధిలో రెండు స్థానాలను బీసీలకు కేటాయిస్తామన్న హామీని అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టికెట్ల కేటాయింపులో బీసీలను విస్మరించడాన్ని నిరసిస్తూ పెద్దపల్లిలో కొందరు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో పార్టీ మారే అవకాశాలు ఉన్నాయని జోస్యం చెప్పారు.

వైఎస్సార్ పాలన మరువలేనిది...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాల అమలుకే మేనిఫెస్టోలో ప్రాధాన్యం ఇచ్చినా.. అధికారంలోకి వచ్చాక 108, 104 వాహనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజారంజక పాలన అందించారని గుర్తుచేశారు.

ప్రగతిభవన్ నుంచి నిధులు..

పెద్దపల్లిలో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి విజయరమణారావు ప్రచార ఖర్చులకు ప్రగతిభవన్ నుంచి నిధులు వస్తున్నాయని గోనె ప్రకాశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి నిధులు లేవన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి అడ్డదారుల్లో అడ్డగోలుగా నిధులు సమకూర్చుకున్నారని, జాతీయ రాజకీయాల్లో అవకాశమిస్తే దేశమంతటికీ తానే ఖర్చు భరిస్తానని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. పెద్దపల్లిలో గతంలో ఓసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన అభ్యర్థి.. రెండుసార్లు ఓడినా తన ఆస్తులను ఏమైనా అమ్ముకున్నారా? అని ప్రశ్నించారు. ఆయనకు అధికార బీఆర్‌ఎస్ మంత్రులతో సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు.

2024 జూన్ దాకా ఉమ్మడి రాజధాని హైదరాబాద్..

రాష్ట్రరాజధాని హైదరాబాద్ జూన్ 2024 దాకా ఉమ్మడి రాజధానిగానే ఉంటుందని ప్రకాశ్‌రావు అన్నారు. మంత్రి కేటీఆర్ హైదరాబాద్ విషయంలో అవగాహన లేకుండా మాట్లాడరని విమర్శించారు. ఈ విషయంలో తప్పనిసరి పరిస్థితుల్లో గవర్నర్‌కు జోక్యం చేసుకునే అధికారం కూడా ఉందని ఆయన తెలిపారు.

ప్రేమించిన యువతి పెళ్లికి ఒప్పుకోలేదని

- ఉరేసుకొని యువకుడి బలవన్మరణం


రాకేశ్ (ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని వెంగళాపూర్ గ్రామానికి చెందిన అంతెల్పుల రాకేశ్ (22) కొంతకాలంగా ఓ యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. ఇటీవల పెళ్లి చేసుకుందామని ఆమెను కోరగా ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాకేశ్ సదరు యువతి పెళ్లికి ఒప్పుకోవడంలేదని ఇంట్లో చెబుతూ బాధపడుతుండేవాడు. సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఓబీసీ రాష్ట్ర కార్యదర్శిగా జగదీశ్వర్


జగదీశ్వర్

రాయికల్(జగిత్యాల): భారతీయ ఓబీసీ సమైక్య రాష్ట్ర కార్యదర్శిగా రాయికల్ పట్టణానికి చెందిన కడకుంట్ల జగదీశ్వర్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌ను ఏఐడబ్ల్యూజేఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్దండి ముత్యం రాజిరెడ్డి అభినందించారు.

బ్రహ్మచారిణి అలంకరణలో అమ్మవారు



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని భక్తమార్కండేయ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన అమ్మవారు సోమవారం బ్రహ్మచారిణీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఉదయం మంత్రపుష్పం, మంగళహారతి, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నృసింహుని ఊరేగింపు

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామిని దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఊరేగింపు సేవ నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయం చుట్టూ స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

సారంగాపూర్(జగిత్యాల): ఎన్నికల నియమావళి నేపథ్యంలో బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తూనే మరో వైపు బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగిస్తున్నారు. సోమవారం కండ్లపల్లి గ్రామంలో మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, అతడి నుంచి 4 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గౌతంపవార్ తెలిపారు.

హత్య కేసులో ఒకరి అరెస్ట్

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని పెంబట్ల గ్రామంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనలో పోలీసులు ఒకరిని అరెస్టు చేయగా, ఇద్దరు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. గత నెల 12న పెంబట్ల గ్రామంలో ఉట్టి కొట్టే కార్యక్రమం వద్ద జరిగిన గొడవలో పత్తి రాజుపై అదే గ్రామానికి చెందిన పురాణం అర్జున్‌తో పాటు, ఇద్దరు మైనర్లు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈకేసులో అర్జున్‌ను అరెస్టు చేసి జగిత్యాల జైలుకు తరలించగా, మైనర్లను వరంగల్ జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని బుక్కవాడకు చెందిన వివాహిత మిరుదొడ్డి పుష్పలత(40) అదృశ్యం కాగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి సోమవారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన పుష్పలత రాత్రి వరకు ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె సోదరుడు రవికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అక్రమాల నిరోధానికి ప్రత్యేక బృందాలు

- మండల స్థాయిలో ఏర్పాటు
- డబ్బు, మద్యం, వస్తువుల పంపిణీని నిరోధించేందుకు ప్రయత్నం



గొల్లపల్లి(ధర్మపురి): అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడం, నియమావళి అమలులోకి రావడంతో అక్రమాల నిరోధానికి ప్రత్యేక బృందాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. మండల స్థాయిలో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పడగా ఒక బృందం మాత్రం మూడు మండలాలకు తమ నిఘాను విస్తరించనుంది. సర్వైవల్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలతో పాటు టాస్క్‌ఫోర్సు టీంలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖలను సమన్వయం చేస్తూ వివిధ విభాగాల ఉద్యోగులను ఈ బృందాల్లో నియమించారు. ప్రతీ బృందానికి ఒక వీడియో గ్రాఫర్‌ను ఏర్పాటు చేశారు. తనిఖీల్లో పారదర్శకత లోపించకుండా వీడియోగ్రాఫర్ చిత్రీకరణ చేసి ఎన్నికల సంఘానికి రోజు వారీ నివేదికను అందించాల్సి ఉంటుంది. మండలస్థాయిలో ఏర్పడిన టాస్క్‌ఫోర్సు బృందం తమ పరిధిలో కాకుండా మరో రెండు మండలాల్లో పని చేయాలని అధికారులు నిర్దేశించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు మూడు మండలాల్లో షిఫ్టులవారీగా ఎన్నికల తంతు ముగిసే వరకు పని చేయాల్సి ఉంటుంది. సర్వైవల్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు మాత్రం తమ మండల పరిధిలో పనిచేయాలి. జిల్లాలోని అన్ని రెవెన్యూ మండలాల్లో మంగళ వారం నుంచి నిఘా బృందాలు రంగంలోకి దిగాయి. అభ్యర్థులు మద్యం, డబ్బు, విలువైన బహుమతులు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభానికి గురి చేయకుండా ఉండటానికి ఈ బృందాలు పనిచేయాల్సి ఉంటుంది. ప్రతీ బృందానికి పోలీసుల సహకారం పక్కాగా ఉండేల చర్యలు తీసుకున్నారు. నిఘా బృందంలోని ఉద్యోగులకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సెలవులు రద్దు చేశారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగడానికి నిఘా పెంచారని అధికారులు వెల్లడించారు.

ఉద్యోగులూ జాగ్రత్త

- ఎన్నికల విధులపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక నిఘా



పెగడపల్లి(ధర్మపురి): గత ఎన్నికల సమయంలో ఒక ఉద్యోగి మండలంలోని ఓ గ్రామంలో ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని మరో పార్టీకి చెందిన నాయకుడు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశాడు. దీంతో సదరు ఉద్యోగిపై విచారణ చేసిన అధికారులు తాఖీదులు జారీ చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఉద్యోగులపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా పెంచి ఎన్నికల నియామవళి అమలులో కఠినంగా వ్యవహరిస్తుంది. ఉద్యోగులు కేవలం తమ విధుల నిర్వహణకే పరిమితం కావాలి తప్ప ఏ రాజకీయ పార్టీకి కొమ్ము కాయొద్దని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

నిబంధనలు..

ఉద్యోగులు ఏ రాజకీయ ప్రధాన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకూడదు. తనకింది ఉద్యోగులను, ఇతరులను ఫలానా పార్టీకి ఓటు వేయాలని నిర్దేశించొద్దు. ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు. రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించొద్దు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు చేయకూడదు.

ఎప్పటికప్పుడు వీడియో చిత్రీకరణ

అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమ దూరంలో ఉద్యోగులు ఉండాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా వీడియో సర్వైలెన్స్ బృందాలు ప్రచార సభలు, సమావేశాలపై నిఘా పెట్టి వీడియో చిత్రీకరిస్తున్నాయి. వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీడియో వ్యూయింగ్ బృందం వీక్షిస్తోంది. ఉద్యోగులు పాల్గొన్నట్లు రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధి ఫిర్యాదు చేస్తే స్థానిక అధికారులు ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుంది. నిర్ధారణ అయితే సస్పెన్షన్ వేటు పడుతుంది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, మీడియాలో వార్తలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా మిడియా మానిటరింగ్ టీం ఏర్పాటు చేశారు. ఉద్యోగులు ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపుల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా పోస్టులు చేస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోనుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన ఉద్యోగులను మొదట విధుల నుంచి తప్పించిన తర్వాత విచారణ చేపట్టనున్నారు.

ధర్మపురి బీజేపీ అభ్యర్థిగా 'క్యాతం'?


వెంకటరమణ

గొల్లపల్లి(ధర్మపురి): బీజేపీతో పాటు ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్, బీఎంఎస్ లాంటి అనుబంధ సంస్థల్లో 35 ఏళ్లుగా పనిచేస్తున్న క్యాతం వెంకటరమణకు ధర్మపురి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వెంకటరమణ 2012 నుంచి ధర్మపురిలో కార్తీకమాస సమయంలో గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. గోదావరి హారతి రాష్ట్ర కోకన్వీనర్‌గా వ్యవహరిస్తూ ఈ ప్రాంతంలో సుపరిచితమైన వ్యక్తిగా ఉన్నారు. ప్రస్తుతం బీజేపీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రభారిగా, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. వివేక్ వెంకటస్వామి ధర్మపురిలో పోటీ చేయని పక్షంలో వెంకటరమణను బరిలో నిలిపేందుకు అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ పథకాలను కేసీఆర్ కాపీకొట్టారు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను సీఎం కేసీఆర్ కాపీ కొట్టారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో ఏఐసీసీ సెక్రటరీ విష్ణునాథ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కోసం ఆత్రుతగా ఎదురుచూశారని, ఎంతో మేధోమదనం చేస్తారని ఊహించానని, చివరి తమ పార్టీ ఆరు గ్యారంటీలనే చెప్పినట్టుగా అనిపించారని పేర్కొన్నారు. గ్యాస్ ధర పెరిగితే రాష్ట్రంలో తగ్గించని పార్టీ.. ఇప్పుడు రూ.400కు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్లలో ఏ ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదని, కనీసం స్థలం కూడా చూపలేదని, ఇప్పుడు అందరికీ ఇళ్లు ఇస్తామంటే నమ్మశక్యంగా లేదన్నారు. రాష్ట్రంలో 1.90లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా కనీసం జాబ్ క్యాలెండర్ ప్రకటించని పార్టీ ఏం చేస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. విష్ణునాథ్ మాట్లాడుతూ ఈనెల 18న ములుగులో రాహుల్‌గాంధీ బస్సు యాత్ర, బహిరంగ సభ ఉంటుందని, జగిత్యాలలో ఈనెల 20న పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. దసరా తర్వాత రాష్ట్రంలో రెండోవిడత రాహుల్‌గాంధీ పర్యటన ఉంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు బండ శంకర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, దుర్గయ్య, కొత్త మోహన్, ధర రమేశ్‌బాబు, గుండ మధు, రాజేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదల సంక్షేమం

రాయికల్: కాంగ్రెస్‌తోనే నిరుపేదల సంక్షేమం సాధ్యమని జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని జగన్నాథపూర్‌కు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీంలను అమలు చేస్తుందని, బీఆర్‌ఎస్, బీజేపీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు.

మరోసారి ఆశీర్వదించండి


ప్రచారంలో జెడ్పీచైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక

జగిత్యాల: ఒకసారి అవకాశం ఇవ్వగా వందరెట్లు అభివృద్ధి చేసుకోవడం జరిగింది.. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సతీమణి రాధిక అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని 33 వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వివరించారు. వృద్ధులకు పెన్షన్లు, పేదలకు కల్యాణలక్ష్మి ఇలా ఎన్నో పథకాలను అమలు చేసి అందరికీ అండగా ఉంటున్నారన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకుని జగిత్యాలను ఎంతో అభివృద్ధిలో తీసుకెళ్తున్నారని, మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

మద్దుట్లలో గడపగడపకూ కాంగ్రెస్


ప్రచారంలో సత్యం, నాయకులు

మల్యాల(చొప్పదండి): అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసే కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని, ఆశీర్వదిస్తే, అభివృద్ధి చేసి చూపిస్తామని చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మద్దుట్ల గ్రామంలో సోమవారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రజలకు గ్యారెంటీ పథకాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటి పథకాలతో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, మారంపల్లి లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, ముత్యం శంకర్, సతీశ్‌రెడ్డి, శనిగరపు తిరుపతి, భూమన్న, హరినాథ్, రాకేశ్, రాజన్న, శ్యాంసుందర్, రాజిరెడ్డి, సాయి, నర్సింహారెడ్డి, అనిల్ పాల్గొన్నారు.